వైభవంగా యాదగిరీశుడి తిరు కల్యాణోత్సవం

భూగర్భ గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ చేపట్టారు. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటి కలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.17,80,292 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ముఖ మండపంలో అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించి తొళక్కం నిర్వహించారు. వేద పారాయణికులతో దివ్య ప్రబంధ పారాయణం గావించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి తిరుమంజనం, స్నపనం, సాయంత్రం అమ్మవారి సేవలను ఊరేగించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు తెలిపారు. బుధవారం ఉదయం అభిషేకం, అర్చనలు, సాయంత్రం విశేష ఆరాధన, ఆరగింపుతో ఉత్సవాలు ముగియనున్నట్లు వెల్లడించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సీఎం పీఆర్వో బోరెడ్డి అయోధ్యారెడ్డి, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత అందెశ్రీ వేర్వేరుగా దర్శించుకున్నారు. అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి, దర్శనానంతరం వేద ఆశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

యాదగిరిగుట్ట : మాసాయిపేటలో లక్ష్మి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట/ యాదగిరిగుట్ట, ఆగస్టు 5 : పలువురి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఈసీ మెంబర్ నంగునూరి కృష్ణమూర్తిగుప్తా తల్లి జెన్నమ్మ ఇటీవల మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్ రెడ్డి సోమవారం నంగునూరి బ్రదర్స్‌ను పరామర్శించి జెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రఘునాథపురం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గొలుసుల శ్రీనివాస్ మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన కళ్లెం లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు బిల్లకుదురు రాజు, నాయకులు మధు, బాలసిద్ధులు, రాములు, కృష్ణమూర్తి, బాలరాజు, శివ, శ్రీను, భాస్కర్, స్వామి, రాజు, జశ్వంత్, మహేందర్‌గౌడ్, సత్యనారాయణ, స్వామి, వెంకటేశం, బాలకృష్ణ పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో చెవి శస్త్ర చికిత్స


చికిత్సకు ముందు

చికిత్స తరువాత

బీబీనగర్, ఆగస్టు 5 : పుట్టుకతో చెవి లేని 11 ఏండ్ల బాలుడికి బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు శస్త్ర చికిత్స చేసి చెవిని అమర్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బర్న్స్, ప్లాస్టిక్ సర్జరీ డాక్టర్ మూలా రోహిత్‌బాబు మాట్లాడుతూ మైక్రోటియా అనే వ్యాధితో బాలుడు బాధపడుతున్నాడని, ఎన్నో దవాఖానలు తిరిగి చికిత్స చేయించినా నయం కాలేదని అన్నారు. చివరి ప్రయత్నంలో బీబీనగర్ ఎయిమ్స్‌కు రాగా ప్లాస్టిక్ సర్జరీ ద్వారా కొత్త చెవిని అమర్చామని చెప్పారు. చికిత్సకు 6 గంటల సమయం పట్టిందని, చికిత్స అనంతరం బాలుడు కోలుకున్నాడని తెలిపారు. చిన్నపాటి సర్జరీలు చేసి సాధారణ రూపానికి దగ్గరగా ఉండేలా పునర్నిర్మించిన చెవిని మరింత మెరుగుపరుస్తామన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా మార్గదర్శకత్వంలో తాము సంక్లిష్టమైన పుట్టుక వైకల్యాలు, లోపాలను పరిష్కరించడం ప్రారంభించామని చెప్పారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 5 : హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా హాస్టల్ విద్యార్థుల బతుకులు మారలేదన్నారు. మెనూ పాటించకుండా విద్యార్థులను ఆకలితో చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, నాయకులు నేహాల్, భవానీశంకర్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

ఆలేరు రూరల్, ఆగస్టు 5 : స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలేరులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ సోమవారం ఒక్క రోజు ఉపవాస దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ అయిలయ్య ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఆలేరులో బీరప్పగుడి దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలంలో నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

డోజర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లేశం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 5 : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి డోజర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరె మల్లేశం, ఉపాధ్యక్షుడిగా గంగారపు మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కసరబోయిన కుమార్, కోశాధికారిగా వెలిమకన్నె మత్స్యగిరి ఎన్నికయ్యారు. సమాశంలో కమిటీ సభ్యులు నాగరాజు, సతీశ్, రమేశ్, స్వామి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఆగస్టు 5 : మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ స్వీకరించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సోమవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. యాదగిరిపల్లిలో హయగ్రీవస్వామి ఆలయం ప్రాంతంలో ఓ వెంచర్‌లో ఈత మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, దీపిక, ఫారెస్ట్ సీఐ రాధాకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, కమిషనర్ ఆజయ్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ విజయశారధి, గౌడ సంఘం అధ్యక్షుడు సీస కృష్ణ గౌడ్, నాయకులు మల్లేశ్, చిన్న వెంకటయ్య, మహేశ్వర్, వాసు, బాలయ్య, మునిందర్, సురేశ్, నర్సింహ, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు తీస్తే.. తాట తీయండి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు

సంస్థాన్ నారాయణపురం : బెల్ట్ షాపులు బంద్ చేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి విన్నవిస్తున్న మహిళలు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 5 : గ్రామాల్లో బెల్ట్ షాపులు తీస్తే తాట తీయాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపులు 24గంటలూ నడిపిస్తున్నారని, తమ భర్తలు తాగి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఎదుట మహిళలు గోడు వెళ్లబోసుకున్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే.. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి పేర్లు పోలీసు అధికారులకు చెప్పాలని, ఎస్ఐ, సీఐ, ఏసీపీ ఫోన్ నెంబర్లను మహిళలకు ఇప్పించారు. బెల్ట్ షాపులను అరికట్టడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని, అందుకు మహిళలు కూడా సహకరించాలని కోరారు. ఈ విషయంలో పోలీసులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తేగా.. కొత్త భవనాలు కట్టిస్తానని అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రతి ఇంటికీ మంచినీరు ఇస్తాం

చౌటుప్పల్ : పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటిని అందిస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి వ్యవస్థను పెంచేందుకు రూ.21కోట్లతో ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అంతకుముందు పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, డీఈ వెంకటేశ్వర్లు, డీఈ మనోహర, ఏఈ వెన్నల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

- పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి : విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 5 : పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ, యజమానులు, పట్టణ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రజలకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. 11, 12, 13వ వార్డుల్లో పారిశుధ్యం, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వీరారెడ్డి, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు అఖిల, దేవరాయ కుమార్, నర్సింహ, మండల వైద్యాధికారి శ్రీవాణి, మున్సిపల్ మేనేజర్ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని తాజ్‌పూర్, బొల్లెపల్లి, అనంతారం గ్రామాల్లో స్వచ్ఛ ర్యాలీలు, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పచ్చదనాన్ని పెంపొందించాలని డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు.

పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన

ఆలేరు రూరల్ : మండల వ్యాప్తంగా సోమవారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలో స్వచ్ఛదనం, పచ్చదనం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్ కోరారు.

గుండాల : మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో చేయాల్సిన పనులపై చర్చించారు. మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి గూడ వెంకటేశ్వర్లు పాల్గొని మాటాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ధనుంజయ్, ఏపీఓ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు, పర్యావరణపై అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఎంపీడీఓ ఇందిర, మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మండల వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి చెత్తాచెదారం తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ ఏఈ సందీప్‌రెడ్డి, డాక్టర్ స్వర్ణలత, సీసీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భువనగిరి కలెక్టరేట్ : బొల్లెపల్లిలో ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధికారులు

దళిత మహిళపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన

మోత్కూరులో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు

మోత్కూరు, ఆగస్టు 5 : షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మోత్కూరులోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంగారం దొంగతనం కేసులో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితోపాటు మరో ఐదుగురు పోలీసులు దళితులైన సునీత, భీమయ్య దంపతులను తీవ్రంగా హింసించారన్నారు. సంబంధిత పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్ విద్యాసాగర్, నాయకులు నరేశ్, శ్రీను, వెంకన్న, యాదగిరి, సందీప్ పాల్గొన్నారు.

మహిళను హింసించడం దారుణం

అడ్డగూడూరు : దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని సునీతను దొంగతనం చేశారన్న ఆరోపణతో హింసించడం దారుణమని మండిపడ్డారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డబ్బుతో ఉడాయించిన నిందితులకు రిమాండ్

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

వలిగొండ, ఆగస్టు 5 : నెలనెలా అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని పారిపోయిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన కొర్లపల్లి వెంకటేశ్వర్లు, కొర్లపల్లి ప్రశాంత్, కొర్లపల్లి అనిల్‌కుమార్ కిరాణం షాపులో పెట్టుబడి కోసం డబ్బు కావాలని గ్రామస్తులను అడిగారు. అందుకు ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశ చూపి పలువురి వద్ద సుమారు కోటీ 50 లక్షల రూపాయలు అప్పు తీసుకొని ఊరు వదిలి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సోమవారం వారిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలిలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 5 : మండంలోని చిమిర్యాల గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిమిర్యాల గ్రామానికి చెందిన మల్లేపల్లి శ్రీకాంత్‌రెడ్డి (37) ఆదివారం గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు స్నేహితులతో కలిసి హాజరయ్యాడు. అనంతరం బైక్‌పై ఇంటికి వెళ్తుండుగా గ్రామంలోని కల్వర్టు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయాడు. బండ రాళ్లు తలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి కావడంతో ఎవరూ గుర్తించలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

బీబీనగర్, ఆగస్టు 5 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామ పరిధిలోని కేఎస్ఎస్ వెంచర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బొంత ముత్యాలు (60) పక్కనే ఉన్న వాటర్ ట్యాంకర్ దగ్గర మృతి చెంది ఉన్నాడు. సోమవారం ఉదయం వెంచర్‌లోకి వెళ్లిన గ్రామస్తులు చూసి పోలీసులకు తెలియజేశారు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రమేశ్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

మానవ మనుగడ కోసం మొక్కలు పెంచాలి

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్
- హాజరు కాని అధికారులపై ఆగ్రహం

అడ్డగూడూరు : లక్ష్మీదేవికాల్వ గ్రామంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, ఆగస్టు 5 : మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచే బాధ్యత తీసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని డి.రేపాక గ్రామంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. తమ గ్రామాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో త్వరలో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. హిందీ ఉపాధ్యాయుడు లేడని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. డీఈఓతో ఫోన్‌లో మాట్లాడి హిందీ ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. పొడిచేడు నుంచి చిత్తలూరు గ్రామం వరకు మూసీ వాగులో 5 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. అడ్డగూడూరులో ఐటీఐ కాలేజీ ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి హాజరు కాని మండల వైద్యాధికారి, విద్యుత్ ఏఈ, వ్యవసాయ శాఖ అధికారులపై ఎమ్మెల్యే సామేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రభుత్వ కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శంకరయ్యను ఆదేశించారు. రుణమాఫీ జరుగకపోతే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. తాసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శంకరయ్య, మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీఓ ప్రేమలత, నాయకులు లింగాల నర్సిరెడ్డి, చంద్రయ్య, విద్యాసాగర్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామంలో ఎమ్మెల్యే సామేల్ మొక్కను నాటి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య, ఎంపీడీఓ శంకరయ్య, పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి జగన్మోహన్‌ప్రసాద్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 5 : కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి దరఖాస్తులు వెల్ల